సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 17 । మార్చి । 2023



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు.

- 8లో



అధికారులు వర్సెస్ మిర్చి వ్యాపారులు

ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు.

- 8లో

గరిష్టం/కనిష్టం
37.1^0 / 20.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలి



మరిపెడ రూరల్: వేసవిలో మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఇన్‌చార్జ్ డీపీఓ, మరిపెడ ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్ అన్నారు. మరిపెడ మండలం చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకం జరగాలన్నారు. ఎండ వేడిమిని తట్టుకునేలా మొక్కలకు నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మొక్కలు ఎండిపోకుండా నీరు, నీడ, పర్యవేక్షణ చేయడంతో పాటు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో 10 వేలకు తగ్గకుండా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, నర్సరీల నిర్వాహకులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛత’ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- కమిషనర్ ప్రసన్నరాణి

మహబూబాబాద్: ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలు ఉమెన్‌ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్‌ల పరిశుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయడం వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీలోపు మున్సిపల్ కార్యాలంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి సెల్ నంబర్ 8790155423లో సంప్రదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య గిరిజన బాలికల మోడల్ గురుకుల కాలేజీలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్ గురువారం తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయగా.. ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ ఇమ్మానీయేల్, ఇంటర్ పరీక్షల కమిటీ సభ్యుడు వీరేంద్ర, కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ సరిత, డిపార్ట్‌మెంట్ అధికారి సురేష్ ఉన్నారు.

నేడు సీపీఆర్‌పై శిక్షణ

నెహ్రూసెంటర్: గుండెపోటు నుంచి రక్షించేందుకు తక్షణమే చేపట్టే సీపీఆర్ విధానంపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 9.30గంటలకు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ శశాంక ప్రారంభిస్తారని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ గురువారం తెలిపారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించేందుకు ఐదుగురు మాస్టర్ ట్రైనర్లు హాజరవుతారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి, పోలీస్, రెవెన్యూ, మున్సిపాలిటీ, కలెక్టరేట్, అగ్రికల్చర్, డీఆర్‌డీఏ, విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, బ్యాంకింగ్, ఎల్ఐసీ, రైల్వే, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: ఇన్‌స్పైర్ మానక్ 9వ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైన విద్యార్థులు నక్క భవాని, ఎడ్ల నానిలను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక సన్మానించి పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గైడ్ టీచర్లు, డీఈఓ రామారావు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

పనులొద్దు.. పైసలొద్దు

పనులు చేసి మూడేళ్లు గడిచినా అందని బిల్లులు

- నిరుత్సాహంలో సర్పంచ్‌లు
- అధికారుల అలసత్వంతో పెండింగ్‌లో ఫైల్స్
- బిల్లుల కోసం కార్యాలయానికి వెళ్తే అధికారుల అవహేళన
- కొత్తగా మంజూరైన పనులు చేపట్టేందుకు వెనకడుగు..

- ‘మహబూబాబాద్ నియోజకవర్గంలోని ఓ గిరిజనతండా సర్పంచ్ మూడేళ్లుగా తండాలో రూ.18లక్షలతో నర్సరీ, సీసీరోడ్లు, శ్మశాన వాటిక, డంపింగ్‌యార్డుతో పాటు ఇతర పనులు చేపట్టారు. కాగా ఇప్పటి వరకు ఆయనకు రూ.2లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయి. మరో రూ.16లక్షలు రావాల్సి ఉంది. అప్పులు చేసి పనులు చేపట్టానని, మిత్తి మీదపడుతుందని సర్పంచ్ వాపోయారు.’

- కురవి మండలంలోని ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ ఎన్ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపొండ్ కింద వచ్చిన నిధులతో పనులు చేశారు. కాగా కొన్ని బిల్లులు రాగా మరో రూ.2లక్షలు రావాల్సి ఉంది. తన తర్వాత పనులు చేసిన వారికి బిల్లులు వచ్చాయని తనకు మాత్రం బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్ ఆరోపించారు. పనులు చేసిన పాపానికి ప్రజా సమస్యల కోసం ఇంటికి వచ్చే వారి కంటే అప్పులోళ్లు ఎక్కువ మంది వస్తున్నారని, ఇంట్లో గొడవలు అవుతున్నాయని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, మహబూబాబాద్: ఇలా జిల్లాలోని ఏ గ్రామ సర్పంచ్‌ను కదిలించినా.. పనులు చేసినందుకు అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పనుల బిల్లులే రాలేదని, కొత్త పనులు చేసి మరిన్ని అప్పులు చేయలేమని కొందరు సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు.

పనులు ప్రారంభించడానికి వెనకడుగు..

పాత పనుల బిల్లులు ఇప్పటి వరకు రాకపోవడంతో కొత్త పనులు చేసేందుకు జిల్లాలోని సర్పంచ్‌లు వెనకడుగు వేస్తున్నారు.కొందరైతే ‘మీ పనులు వద్దు.. మీ డబ్బులు’ వద్దంటూ నిర్మొహమాటంగా చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈజీఎస్ ద్వారా జిల్లాకు 501 సీసీరోడ్లు, 66 డ్రెయినేజీలు, 81 మెటల్ రోడ్లు మొత్తం 648 పనులు చేసుకునే అవకాశం వచ్చింది. ఇందుకు రూ.67.08 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఈ పనులు మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేస్తేనే బిల్లులు వస్తాయి. అంటే మరో 15రోజుల్లో పనులు పూర్తి చేయాలి. ఎంబీలు, క్యూసీ రిపోర్టులు మొదలైన ప్రక్రియలు పూర్తి చేయాలి. కానీ ఇప్పటి వరకు జిల్లాలో 366పనులు ప్రారంభించలేదు. కేవలం రూ.4.66 కోట్ల విలువ చేసే పనులు మాత్రమే పూర్తి చేశారు.

ఇబ్బందుల్లో ఉన్నాం.. ఆదుకోవాలి



మహబూబాబాద్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

మహబూబాబాద్ రూరల్: గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, పనుల బిల్లులు చెల్లించి ఆదుకోవాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్ అన్నారు. నిధులు విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మహబూబాబాద్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోడ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అభివృద్ధి పనులు చేపట్టామని, అయితే వాటికి సంబంధించిన బిల్లులు మాత్రం రావడం లేదన్నారు. అప్పులు చేసి, పుస్తెలతాళ్లు తాకట్టుపెట్టి గ్రామాల్లో పనులు చేస్తే ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడం సరికాదన్నారు. జీపీ ట్రాక్టర్ల ఈఎంఐలు, మెయింటనెన్స్, డీజిల్ ఖర్చులు, జీపీ సిబ్బంది వేతనాలు రావడం లేదన్నారు. 15వ ఫైనాన్స్ డిజిటల్ కీలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని కోరారు. సర్పంచ్‌ల అనుమతి, నోట్ ఫైల్ లేకుండా అధికారులు నిధులు డ్రా చేయవద్దన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే తమ పదవులకు రాజీనామా చేస్తామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాలాజీ, సుమన్, సత్యం, బాలు, రమేష్, వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు రమేష్, వెంకన్న, భాస్కర్, మండల పంచాయతీ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

పనులు చేపట్టిన అనంతరం పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్వాలిటీని పరిశీలించి బిల్లులు చేయాలి. కానీ తమకు నచ్చితే ఒకతీరు.. నచ్చకపోతే మరోతీరుగా అధికారులు వ్యవహరిస్తున్నారని జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అధికారులు అడిగిన విధంగా కమీషన్ ఇస్తేనే ఫైల్ కదులుతుందని, ఈ వ్యవహారమంతా కార్యాలయంలోని ఓ ఉద్యోగి కనుసన్నల్లో జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కాగా సమస్యను జిల్లా ఉన్నతాధికారికి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిసింది. పైగా డబ్బులు వచ్చినప్పుడే తీసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట్ల రూపాయలు పెండింగ్..

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల బిల్లులు రూ.91.35కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2016 నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకు పనులు చేపట్టారు. ఇందులో ఈజీఎస్ ద్వారా 3,531చోట్ల సీసీ రోడ్లు నిర్మించేందుకు ఎస్టిమేట్ వేశారు. పనులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 2,489 పనులు పూర్తి చేశారు. దీంతో సీసీరోడ్ల కోసం కేటాయించిన రూ.168.42కోట్లకు గానూ రూ.102.36కోట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన రూ.66.05కోట్ల పనులు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా రూ. 82లక్షలతో 13 అంగన్‌వాడీ భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయగా.. ఎనిమిది భవనాలు ప్రారంభించలేదు. 5భవనాలు నిర్మించగా.. ఇంకా పూర్తిగా బిల్లులు రాలేదు. 89 గ్రామ పంచాయతీలకు నూతన భవనాల కోసం రూ.14.24 కోట్లు మంజూరు కాగా ఇందులో 48 భవనాలు పూర్తి చేశారు. 13భవనాల పని పూర్తి కాలేదు. 28 భవనాలు ఇంకా ప్రారంభించలేదు. వీటికి రూ.7.19 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించగా.. రూ.7.05కోట్ల బిల్లులు, పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు శ్మశాన వాటికలు, రైతు వేదికలు,మన ఊరు–మన బడి పనుల్లో కొన్నింటికి ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. కొన్ని పనులు పూర్తి చేయలేదు. మరికొన్ని పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు.

రూ.95లక్షల బిల్లులు ఆన్‌లైన్ నుంచి మాయం

పనుల బిల్లుల వివరాలు ఆన్‌లైన్ నుంచి మాయమయ్యాయి. జిల్లాలోని తొర్రూరు, పెద్దవంగర, నర్సింహులపేట, నెల్లికుదురు, కురవి, మరిపెడ మండలాల్లోని 25గ్రామాల్లో నిర్మించిన జీపీ భవనాలు, శ్మశాన వాటికలు, చిన్నగూడూరు మండల పరిధి జయ్యారంలో రైతు వేదిక పనులు పూర్తి చేశారు. మొత్తం పనులకు రూ.3.88కోట్లు కాగా.. రూ.2.93కోట్ల బిల్లులు రాగా.. మరో రూ.95లక్షల బిల్లులు రాకుండానే ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ఇదేమిటని అడిగితే తమకేమీ తెలియదని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక





హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, సమయం కావడంతో పరుగులు పెడుతూ..

- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్షకు అనుమతించలేదని కంటతడి పెడుతున్న విద్యార్థిని

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో 5,328 మంది విద్యార్థులకు గాను 4,973 మంది హాజరై.. 355 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 93.3 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు డీఐఈఓ సమ్మెట సత్యనారాణయ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ శశాంక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లు కనపడే విధంగా ప్రదర్శించాలన్నారు. మానుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని అధికారులు పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. అలాగే మానుకోటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి కుడిచేయి విరగగా ఆయన చెల్లెలు స్క్రైబ్‌గా వచ్చి పరీక్ష రాసింది. కాగా జిల్లాలోని తొర్రూరు, మరిపెడ, కేసముద్రం, గూడూరు, బయ్యారం, నెల్లికుదురు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్స్ బృందాలు తనిఖీ చేశాయి.

అనుమతి నిరాకరణ

డోర్నకల్: మండల కేంద్రంలోని డీడీ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు ఆలస్యంగా హాజరైన ఇద్దరు విద్యార్థులను అనుమతించలేదు. స్థానిక కళాశాలలో సీఈసీ చదువుతున్న ప్రవీణ్‌కుమార్, కస్తూర్బా పాఠశాలలో ఎంపీఎస్‌డబ్ల్యూ చదువుతున్న సంగీత పరీక్షకు ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని అధికారులు పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. దీంతో వారు తిరిగి ఇంటికి వెళ్లారు.



మూసి ఉన్న కళాశాల గేటు ఎదుట విద్యార్థులు

25న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మహబూబాబాద్ అర్బన్: మానుకోటలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు జెడ్పీస్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ రమాదేవి గురువారం తెలిపారు. 1,2,3,5,6వ స్థాయీ సంఘాల సమావేశాలు 25న నిర్వహిస్తామన్నారు. అలాగే 4,7వ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 27న ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యులు, జిల్లా అధికారులు సమావేశాలకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

విభజన హామీల అమలుకు పాదయాత్ర

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: రాష్ట్ర విభజన హామీల అమలు, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కాజీపేట రైల్వేకోచ్‌ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ సాధన కోసం ఈ నెల 25నుంచి సీపీఐ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ మహబూబాబాద్ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఏనిమిదేళ్ల మోదీ పాలనలో ఆకలి చావులు, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పాదయాత్ర చేపట్టామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని, ఈమేరకు 26వ తేదీన జిల్లా కేంద్రంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామని,ఈసభకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరవుతారన్నారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపెల్లి వెంకన్న, చొప్పరి శేఖర్, తండ సందీప్, నర్ర శ్రావణ్, బానోత్ లింగ్యానాయక్, వెలుగు శ్రావణ్, తూటి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు సరిపోను స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై మండల స్థాయి అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. వాటర్ ట్యాంక్‌లను పదిరోజులకోసారి శుభ్రం చేయించి రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రజాప్రతినిధుల సంతకాలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేయాలని, నీటి సరఫరాలో లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటి చౌర్యం అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తొర్రూరు డివిజన్‌లోని చర్లపాలెం, గుర్తూరు, కంఠాయపాలెం, వెలికట్ట ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన..

కలెక్టరేట్ ప్రాంగణంలో చేపడుతున్న క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను కలెక్టర్ శశాంక గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీఈ రాజేందర్ తదితరులు ఉన్నారు.

గాలివాన బీభత్సం



రోడ్డుపై విరిగిపడిన చెట్టు



గోపాలపురంలో మిర్చి రాశులపై కప్పిన టార్పాలిన్లు

డోర్నకల్: డోర్నకల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం పెనుగాలులతో కూడిన వాన కురిసింది. గాలికి బైపాస్ రోడ్డులోని పలు దుకాణాల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. సమ్మర్ స్టోరేజీ ప్రాంతం నుంచి మున్నేరు వాగు బ్రిడ్జి వరకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్నేరువాగు సమీపంలోని బట్టీల్లోకి వరదనీరు రావడంతో ఇటుకలు నీట మునిగాయి. బట్టీల ఆవరణలో కూలీలు ఏర్పాటు చేసుకున్న ఇళ్ల పైకప్పులు గాలికి ఎగిరిపోవడంతో ఇళ్లలోని సామగ్రి తడిసిముద్దయింది. చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.





చెట్టు కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది, గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

తడిసిన మిర్చి..

గార్ల: అకాల వర్షంతో మిర్చి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గురువారం కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు తమ మిర్చి రాశులపై టార్పాలిన్లు కప్పుకోగా.. మరికొందరు పట్టాలు కప్పలేదు. దీంతో మిర్చి తడిసిపోయింది. గార్లలోని బెస్తబజారు, జెండాబజారు, వ్యవసాయ కార్యాలయం వీధిలో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది.

‘సర్వేపల్లి’ని స్ఫూర్తిగా తీసుకోవాలి

విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్



మహబూబాబాద్ అర్బన్: భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని గురువారం ట్రైనీ కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి, క్లబ్ సెక్రటరీ మహిపాల్ రెడ్డి, జిల్లా సభ్యులు సురేందర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, గిరిధర్ గుప్తా, వేమిశెట్టి కిషోర్ కుమార్, కోట కనకయ్య, పమ్మి రాజు, క్లోం లక్ష్మారెడ్డి, గూడూరు నాగేశ్వరరావు, తోడేటి వెంకన్న, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ తగాదా కేసులో ఒకరి రిమాండ్‌

నర్సంపేట రూరల్‌: భూ తగాదా కేసులో ఒకరు రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట ఎస్సై రవీందర్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని నాడెం వీరస్వామి మాధన్నపేట పెద్ద కాల్వ సమీపంలో 20 గుంటల భూమి ఉంది. 2018లో అతని కూతురు వివాహం నిమిత్తం ఆ భూమిని నర్సంపేట మండలంలోని ఏనుగల్‌తండాకు చెందిన అనిల్‌ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. అప్పట్లో రెండు సంవత్సరాలపాటు వీరస్వామి కౌలు చేశాడు. ఈ క్రమంలో నా భూమి హద్దులు మార్చారంటూ అనిల్‌ పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పోలీసు స్టేషన్‌ చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో అనిల్‌ పది రోజుల క్రితం నాడెం వీరస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదు చేశారు. సీపీ రంగనాథ్‌ను ఆదేశాల మేరకు ఈనెల 9న డీసీపీ కర్ణాకర్‌, నర్సంపేట ఏసీపీ సంపత్‌రావులు ఆ భూమిని పరిశీలించారు. ఈ క్రమంలో వీరస్వామి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు.

కరీమాబాద్‌లో..

ఖిలా వరంగల్‌: భూ ఆక్రమణకు యత్నించడమే కాకుండా ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ తెలిపారు. కరీమాబాద్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ తోటకు చెందిన దేవర శ్రీనివాస్‌, రాజేశ్వరి దంపతులు 38 గజాల ఇంటి స్థలాన్ని రూ.5 లక్షలకు పల్లకొండ రమేష్‌కు విక్రయించేందుకు 2021 సెప్టెంబర్‌ 29న అగ్రిమెంట్‌ చేసుకున్నారు. రమేష్‌ నుంచి రూ.1 లక్ష అడ్వాన్స్‌గా తీసుకున్నారు. రెండేళ్ల దాటినా రమేష్‌ డబ్బులు ఇవ్వకపోగా ఆ స్థలానికి ప్రహరీ నిర్మాణానికి యత్నించాడు. శ్రీనివాస్‌ అగ్రిమెంట్‌ ప్రకారం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్‌ చేసుకున్న తర్వాతే నిర్మాణం చేపట్టాలని నిలదీశారు. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్‌తో పాటు కురాకుల కల్యాణ్‌, రాయపురం రంజిత్‌లు కలిసి శ్రీనివాస్‌పై కర్రలు, ఇటుక పెళ్లలతో దాడి చేశారు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు.

ఐదుగురి అరెస్ట్‌

ప్రైవేట్‌ వ్యక్తుల భూమిలో జెండాలు పాతి గుడిసెలు వేసేందుకు యత్నించిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌ చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ ముస్క శ్రీనివాస్‌ తెలిపారు. బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ చెప్పారు.

అధికారులు వర్సెస్‌ మిర్చి వ్యాపారులు

- కమీషన్‌ లేకుండా కొనుగోలు చేయాలంటున్న అధికారులు
- కుదరదంటున్న వ్యాపారులు
- టెండర్ల ఆలస్యంతో రైతుల పడిగాపులు
- కమీషన్‌తో నష్టపోతున్నామంటూ కర్షకుల ఆవేదన



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు నిలిచిపోవడంతో పడిగాపులు పడుతున్న రైతులు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఒక పక్క తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి పడిపోగా, మరో వైపు కమీషన్‌ పేరా డబ్బులను కటింగ్‌ చేస్తూ తూకంలో గ్రాముకు లెక్కకట్టకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. వివరాలిలా ఉన్నాయి.. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ-నామ్‌ విధానం కింద కొనుగోలు చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం మార్కెట్‌లో మిర్చి ఖరీదును ప్రారంభించారు. ఆ సమయంలో 3 శాతం కమీషన్‌తోపాటు, గ్రాముల లెక్కకట్టకుండా కొనుగోలు చేసేందుకు రైతు సంఘం, వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాని ప్రస్తుతం ఆ గడువు ముగిసినందున ఎలాంటి కమీషన్‌ లేకుండా తూకంలో గ్రాముల లెక్కతోపాటు, బస్తాకు ఖరీదు కట్టివ్వాలని, ఖరీదు చేసిన రోజునే డబ్బులు చెల్లించాలంటూ పలు రైతు సంఘాల నాయకులు మార్కెట్‌ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చారు. ఈ మేరకు ఇటీవల వ్యాపారులతో, రైతు సంఘం నాయకులతో మార్కెట్‌ అధికారులు చర్చలు జరిపారు. మార్కెట్‌లో నిబంధనల ప్రకారం కమీషన్‌ లేకుండా, తూకంలో గ్రాములకు లెక్కకట్టి డబ్బులు చెల్లించాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మార్కెట్‌కు మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా, అధికారులు చెప్పినట్లుగా తాము ఖరీదు చేయలేమంటూ వ్యాపారులు చేతులెత్తేశారు. దీంతో మధ్యాహ్నం దాటినప్పటికీ వ్యాపారులు ఖరీదుకు రాకపోవడంతో రైతులు మిర్చి యార్డులో రైతులు పడిగాపులు పడ్డారు. చివరకు రైతులు ఆగ్రహానికి గురై అధికారులను నిలదీశారు.

పాతపద్ధతిలోనే కొనుగోలు..

పాతపద్ధతిలోనే మిర్చి ఖరీదు చేస్తామని వ్యాపారులు చెబుతుండగా మరోవైపు ఈ-నామ్‌ విధానం కింద ఎలాంటి కమీషన్‌లు లేకుండానే కొనుగోలు చేయాలని, లేకుంటే ఖరీదుకు అంగీకరించమని మార్కెట్‌ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో మరో మారు చర్చలు జరిగిన తర్వాత తమ నిర్ణయాన్ని చెబుతామంటూ వ్యాపారులు తెలిపారు. ఈ నెల 20 నుంచి కమీషన్‌ లేకుండా, గ్రాములను సైతం లెక్కకట్టి మిర్చిని ఖరీదు చేయాలని స్పెషల్‌ గ్రేడ్‌ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మార్కెట్‌కు 723 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.23,421లు, కనిష్ట ధర రూ.17,055లు పలికింది. తాలు రకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.14,211లు, కనిష్ట ధర రూ.13,911లు పలికినట్లు అధికారులు తెలిపారు.

కమీషన్‌తో నష్టపోతున్నాం..



ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాను. రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. పంటకు తెగుళ్ల సోకడంతో కేవలం 4 క్వింటాళ్ల మిర్చినే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో కమీషన్‌ లేకుండా కొనమంటూ వ్యాపారులు ఖరీదు చేయడానికి రాలేదు. చివరకు మళ్లీ పాత పద్ధతిలోనే కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టపోయాం.

-మొగిలి, అర్పనపల్లి, కేసముద్రం మండలం

పాత పద్ధతితోనే కొనుగోలు చేస్తాం..



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ప్రారంభించే సమయంలో 3 శాతం కమీషన్‌తో, తూకంలో 500 గ్రాములకే లెక్కకట్టి ఖరీదు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. పాత పద్ధతితోనే మిర్చిని కొనుగోలు చేస్తున్నాం. ఇతర మార్కెట్‌ల్లో మాదిరిగానే తాము ఇక్కడ మిర్చిని ఖరీదు చేస్తున్నాం.

-తోకల శ్రీనివాస్‌రెడ్డి, మిర్చి వ్యాపారి

కమీషన్‌ లేకుండానే ఖరీదు చేయిస్తాం..



మార్కెట్‌లో ఎలాంటి కమీషన్‌ లేకుండా, గ్రాములను లెక్కకట్టే విధంగా మిర్చిని ఖరీదు చేయిస్తాం. కొనుగోలు చేసిన రోజునే చెక్కులను ఇచ్చేలా చూస్తాం. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

-అమర లింగేశ్వర్‌రావు, స్పెషల్‌ గ్రేడ్‌ సెక్రటరీ కేసముద్రం మార్కెట్‌

రైలునుంచి జారి పడి మహిళ మృతి

శాయంపేట: రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన సంఘటన చర్లపల్లి స్టేషన్‌ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శాయంపేట మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రభాకర్‌ కుటుంబ సభ్యులతో కలిసి పుష్‌పుల్‌ రైలులో చర్లపల్లికి వెళ్తున్నారు. రైలు దిగుతున్న క్రమంలో ప్రభాకర్‌ భార్య సంధ్య కిందపడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంధ్యను కాపాడే ప్రయత్నంలో ప్రభాకర్‌ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. సంధ్య మృతితో శాయంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..



మృతి చెందిన సుధాకర్‌

భూపాలపల్లి అర్బన్‌: భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని బాంబుల గడ్డ ప్రధాన రాహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కొమ్ము సుధాకర్‌ (30) జిల్లా కేంద్రంలోని బొగ్గు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో బాంబులగడ్డ వద్ద బైక్‌ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌ విప్‌ వినయ్‌భాస్కర్‌

హన్మకొండ: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్‌ భవన్‌లో ఆటో డ్రైవర్లు, ఉన్నతాధికారులతో గురువారం ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆటో డ్రైవర్లకు గౌరవం దక్కిందన్నారు. ఆటో డ్రైవర్ల కోసం త్రిచక్ర ఆటో డ్రైవర్స్‌ పొదుపు, పరపతి సహకార సంఘాన్ని ఏర్పాటు చేయించానని, ప్రస్తుతం రూ.1.50 కోట్ల టర్నోవర్‌తో సహకార సంఘం నడుస్తోందని తెలిపారు. వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ రంగనాథ్‌ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై చలాన్ల విధింపును పరిమితం చేస్తామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఆటో డ్రైవర్ల భవనానికి స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. వరంగల్‌ జిల్లా కలెక్టర్‌ ప్రావీణ్య మాట్లాడుతూ నగరంలో మూడు ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మే 1 న డీసీసీబీ ఆధ్వర్యంలో 100 ఆటోలకు రుణ సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. త్రిచక్ర ఆటో డ్రైవర్స్‌ పొదుపు, సహకార సంఘం కో ఆర్డినేటర్‌ ఎన్‌. రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్‌ పురుషోత్తం, ఆర్టీఓలు వేణు, అఫ్రీన్‌, ఆర్టీసీ వరంగల్‌ ఆర్‌ఎం జాస్తి శ్రీలత, కార్మిక శాఖ సహాయక కమిషనర్‌ కోలా ప్రసాద్‌, ఆర్డీఓ వాసుచంద్ర, కల్పలత సూపర్‌ బజార్‌ చైర్మన్‌ వర్ధమాన్‌ జనార్దన్‌, ఎండీ ఎ.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



పాల్గొన్న ఆటో డ్రైవర్లు

యువకుడి ఇంటి ఎదుట మహిళ నిరసన



యువకుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళ

ధర్మసాగర్‌(వేలేరు): భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళను ఓ యువకుడు మాయమాటలు చెప్పి లోబర్చుకొని, ఆమె వద్ద నుంచి సుమారు రూ.15లక్షలు తీసుకుని మొహం చాటేశాడని బాధిత మహిళ నిరసన చేపట్టింది. ఈ ఘటన గురువారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ముత్తోజు అజయ్‌ అనే యువకుడు నాలుగు సంవత్సరాల క్రితం తనకు పరిచయమై మాయమాటలు చెప్పి తనను కొత్తకొండ దేవాలయంలో రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి మేమిద్దరం కలిసే ఉంటున్నాం. రూ.15లక్షలతో సొంతంగా ఇళ్లు కూడా నిర్మించుకున్నాం. అజయ్‌ తన చెల్లి పెళ్లి చేసిన తర్వాత తనను ఇంటికి తీసుకెళ్లి కలిసే ఉంటామని నమ్మించాడు. ప్రస్తుతం ఐదు నెలలుగా తనతో కలిసి ఉండటం లేదని, పది రోజుల క్రితం ఎర్రబెల్లి గ్రామానికి వస్తే తనను అజయ్‌ తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఈనెల 19న సర్పంచ్‌, పెద్ద మనుషుల ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించుకుంటామని అజయ్‌ తెలిపినట్లు ఆమె తెలిపింది. నాలుగు రోజులుగా సైదాపూర్‌లోని తన ఇంటి వద్దకు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపింది. దీంతో ఆయన వేధింపులు భరించలేక గురువారం ఎర్రబెల్లిలోని అజయ్‌ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మహిళను అక్కడి నుంచి పంపించారు.

వీధికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

- భయాందోళనలో గ్రామస్తులు



కుక్కకాటుకు గురైన కార్తీక్‌ కాలు భాగం

గార్ల: మహబూబాబాద్‌ జిల్లా గార్ల మండలంలోని 3 గ్రామాల్లో గురువారం ఒకేరోజు ముగ్గురిని వీధి కుక్కలు కాటేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కోట్యానాయక్‌తండాకు చెందిన గుగులోత్‌ కార్తీక్‌ (6) ఆడుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన కుక్క.. పలుచోట్ల కరవడంతో 3 చోట్ల కాట్లు పడ్డాయి. పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వృద్ధురాలు గుగులోత్‌ భద్రిని కుక్క కాటు వేసింది. ముల్కనూరుకు చెందిన 5 ఏళ్ల బాలుడు బెల్లం దివ్యక్‌ చక్రవర్తిని వీధి కుక్కలు దాడిచేసి కరిచాయి. వీరందరూ స్థానిక సీహెచ్‌సీలో కుక్కకాటు వ్యాక్సిన్‌ వేసినట్లు డాక్టర్‌ హనుమంతరావు తెలిపారు. గ్రామాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోతుల దాడిలో విద్యార్థికి..



గాయపడిన విద్యార్థి కృతిమ్‌

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని పాలంపేట గ్రామంలో గురువారం దేవులపల్లి కృతిమ్‌(8) అనే బాలుడిపై కోతులు దాడి చేసి గాయపర్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక పూట బడులు కావడంతో దేవులపల్లి రమేష్‌ – శైలజ దంపతుల కుమారుడు కృతిమ్‌ గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోతులు దాడి చేసి గాయ పర్చాయి. గమనించిన తోటి విద్యార్థులు కృతిమ్‌ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అతడిని కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, అధికారులు స్పందించి కోతులను పట్టి అడవిలో వదిలి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ: వరంగల్‌ డీసీసీబీ తొర్రూరు బ్రాంచీ కార్యాలయంలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ను చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు అందజేశారు. గురువారం హనుమకొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తొర్రూరు డీసీసీబీ బ్రాంచీలో పని చేస్తున్న ఉద్యోగి జితేందర్‌ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయనకు వెళ్లాల్సిన బెనిఫిట్స్‌ రూ.6,17,000 విలువ కలిగిన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిన్నారావు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వృద్ధుడు మృతి



రాజేశం (ఫైల్‌)

హసన్‌పర్తి: చెరువులో ఈత కొట్టడానికి తాత మనవళ్లు వెళ్లగా.. ప్రమాదవశాత్తు తాత ఈత కొడుతూ మునిగి పోయాడు. ఈ ఘటన గురువారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రెడ్డిపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేయూ-1 ప్రాంతానికి చెందిన యాంసాని రాజేశం (72) బుధవారం తన మనవడు అక్షిత్‌తో కలిసి రెడ్డిపురం సమీపంలోని ఓ చెరువులో ఈతకు వెళ్లారు. అక్షిత్‌ ఒడ్డుకు ఉండగా రాజేశం చెరువులో ఈత కొడుతూ కనిపించకుండా పోయాడు. గమనించిన అక్షిత్‌ డయల్‌ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈత గాళ్ల సాయంతో గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం రాజేశం మృతదేహం చెరువులో తేలుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్‌: డోర్నకల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ శివారులోని ఊర కుంటలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి జారి పడి మృతి చెందాడు. డోర్నకల్‌ ఎస్సై శ్యాంసుందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడెంకు చెందిన దుగ్గినేని మురళి (47) గురువారం గ్రామ సమీపంలోని ఊరకుంటలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మురళి ఈతకు వెళ్లి మృతి చెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టవర్‌ పైనుంచి పడి వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్‌: విద్యుత్‌ హైటెన్షన్‌ టవర్‌ పైనుంచి ప్రమాదవశాత్తు పడి అంజాద్‌ అలీ (22) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన అంజాద్‌అలీ, అతని తండ్రి జియాహుల్‌ హక్‌తో పాటు మరికొందరు మండలంలోని పాంనూర్‌లో విద్యుత్‌ హైటెన్షన్‌ లైన్‌ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పనులు చేస్తున్న క్రమంలో హైటెన్షన్‌ టవర్‌పై నుంచి ప్రమాదవశాత్తు అంజాద్‌అలీ జారి పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌ తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్‌ నాయకుడి..



ఆంజనేయులు (ఫైల్‌)

స్టేషన్‌ఘన్‌పూర్‌: మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్‌ డైరెక్టర్‌ చిగురు సరిత భర్త, బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు చిగురు ఆంజనేయులు (46) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లిలో ఓ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో ఒంటిలో కాస్త నలతగా ఉందని ఇంటికి వెళ్లాడు. ఇంట్లోకి వెళ్లే క్రమంలో గడప కాలికి తగిలి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన ఆంజనేయులు కుమార్తె తల్లికి సమాచారం అంచింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య ఆంజనేయులు ఇంటికి చేరుకుని చెతస్కోప్‌తో పరీక్షించారు. ఎమ్మెల్యే వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఏఎంసీ చైర్మన్‌ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్‌ నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

హరిభూషణ్‌ పేరుతో పైసలు వసూల్‌

- ముగ్గురు మాజీలతో పాటు మరో వ్యక్తి అరెస్ట్‌
- రూ.1.20 లక్షల నగదు, ఎయిర్‌పిస్టల్‌, నాలుగు సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్‌ డీఎస్పీ రమణబాబు



నకిలీ మావోయిస్టులను చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, చిత్రంలో పోలీస్‌ అధికారులు

బయ్యారం: మావోయిస్టు రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిభూషణ్‌ పేరుతో బలవంతపు వసూళ్లు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను గురువారం మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఇన్‌చార్జ్‌ డీఎస్పీ రమణబాబు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన దళ కమాండర్‌ ముత్తయ్య అలియాస్‌ ఆజాద్‌, బయ్యారం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్‌ పసుల లింగయ్య అలియాస్‌ లింగన్న, ఖమ్మం పట్టణం బల్లేపల్లికి చెందిన బత్తుల రామకృష్ణ, బయ్యారానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన ఆర్గనైజర్‌ నిమ్మల లింగయ్యలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. బయ్యారం మండలంలో గతంలో నక్సల్స్‌ కార్యకలాపాలు కొనసాగడాన్ని ఆసరాగా చేసుకున్న వీరు అమాయకులను టార్గెట్‌గా చేసుకొని వసూళ్లకు తెరలేపారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇల్లందు నుంచి కొత్తపేటలోని తన వ్యవసాయభూమి వద్దకు వచ్చిన వ్యాపారి యాదగిరిరెడ్డిని ఎయిర్‌గన్‌తో బెదిరించి మాజీ మావోయిస్టు హరిభూషణ్‌ పంపించారని రూ.20 లక్షలు డిమాండ్‌ చేశారు. అతను డబ్బులు ఇవ్వకపోవటంతో కిడ్నాప్‌ చేశారు. తరువాత రూ.1.20 లక్షలు ఇవ్వగా విడుదల చేశారు. ఈక్రమంలో బయ్యారంలో సీసీఎస్‌, స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మావోయిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ రమణబాబు తెలిపారు. బయ్యారం మండలంలో మావోయిస్టులు, ఇతర నక్సల్స్‌ కార్యకలాపాలు లేవని, నక్సల్స్‌ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. నకిలీ నక్సలైట్లను పట్టుకున్న సీసీఎస్‌ సీఐ మోహన్‌, గార్ల-బయ్యారం సీఐ బాలాజీ, సీసీఎస్‌ ఎస్‌ఐ రామారావు, బయ్యారం ఎస్‌ఐ రమాదేవి, సీసీఎస్‌ ఏఎస్‌ఐ పాపయ్య, కానిస్టేబుల్స్‌ రాజశేఖర్‌, విజయ్‌, బాలు, సుమన్‌, హోంగార్డు మధుసూదన్‌రెడ్డిలను అభినందించి రివార్డులు అందజేశారు.